క్లుప్తంగా

ముగిసిన వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు



వసంతోత్సవంలో తెలగ సంఘ సభ్యులు

నాగులుప్పలపాడు: మండలంలోని ఉప్పుగుండూరులో వేంచేసి ఉన్న శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా చక్రస్నానం, పూర్ణాహుతి, హోమం నిర్వహించి అనంతరం తెలగ సంఘం ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా వసంత సేవ నిర్వహించారు. యువత, మహిళలు వసంతం, గులాం చల్లుకుంటూ ఉత్సాహంగా పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమాలను దేవస్థానం ఈఓ పి.రామకృష్ణారావు, చైర్మన్ మాగులూరి సత్యనారాయణ పర్యవేక్షించారు.

వైఎస్సార్ సీపీ కొత్తపట్నం మండల కమిటీ నియామకం

కొత్తపట్నం: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కొత్తపట్నం మండల కమిటీని నియమించారు. అధ్యక్షునిగా లంకపోతు అంజిరెడ్డిని ఈ ఏడాది ఫిబ్రవరి నెలలోనే ప్రకటించగా, గురువారం సాయంత్రం కమిటీ సభ్యులను ప్రకటించారు. వైస్ ప్రెసిడెంట్లుగా సుదర్శి కోటేశ్వరరావు, తాతా నాంచార్లు, జనరల్ సెక్రటరీలుగా కొల్లూరి సంజీవులు, కట్టా శ్రీనివాసరావు, షేక్ కరిముల్లా, సెక్రటరీలుగా పెద్దసింగు వెంకట్రావు, దోనె రామ్మోహన్, బందారు వెంకటసుబ్బారావు, యలగాల ఆదినారాయణ, మల్లవరపు వెంకటరమేష్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఆరుమూళ్ల వెంకటసుబ్బారావు, తిరువీధుల వెంకాయమ్మ, దోనెంపూడి శ్రీను, జజ్జర సాంబయ్య, నాయుడు గిరిస్వాములు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

మాజీ కౌన్సిలర్ మృతికి 'అన్నా' నివాళి

మార్కాపురం: మార్కాపురం పట్టణంలో మాజీ కౌన్సిలర్, వైఎస్సార్ సీపీ నాయకుడు డి.ఖాశీంపీరా అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మార్కాపురం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు పార్టీ నాయకులతో కలిసి వెళ్లి ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ నాయకులు ఉత్తమ్ కుమార్, విశ్రాంత వార్డెన్ నజీర్ అహ్మద్, ఖాశీం తదితరులు ఉన్నారు.

అశ్వవాహనంపై అఖిలాండ బ్రహ్మాండ నాయకుడు



అశ్వవాహనంపై చెన్నకేశవస్వామి

ఒంగోలు మెట్రో: స్థానిక కొప్పోలు కేశవక్షేత్రం, చెన్నకేశవ ఆంజనేయస్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఆలయ అర్చకుడు చక్రస్నానాన్ని ఘనంగా నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ స్వామిని విశేషంగా అలంకరించి మంగళవాయిద్యాలతో పురవీధుల్లో ఊరేగించారు. అశేష భక్తకోటికి అశ్వవాహనంపై స్వామివారు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో వ్యవస్థాపక ధర్మకర్తలు వెంకట శేషారెడ్డి, విజయరామిరెడ్డి, సువర్ణ, దేవస్థానం కార్యనిర్వహణాధికారి కట్ట సునీల్ కుమార్, అర్చకుడు పరాంకుశ సమీర్ కుమార్, భక్తులు పాల్గొన్నారు.



చక్రస్నానం చేస్తున్న అర్చకుడు

ఏడాదికి కోటి ఉద్యోగాలు ఏమయ్యాయి.?

- మోదీ సమాధానం చెప్పాలి
- సార్వత్రిక సమ్మెకు మద్దతుగా గ్రామాల్లో నిరసన వ్యక్తం చేయాలి
- వ్యవసాయ కార్మిక సంఘం పిలుపు



సార్వత్రిక సమ్మె కరపత్రాలు ఆవిష్కరిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు

ఒంగోలు టౌన్: ఏడాదికి కోటి ఉద్యోగాలిస్తానన్న ప్రధాన మంత్రి మోదీ హామీ ఏమైందో చెప్పాలని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి కంకణాల ఆంజనేయులు ప్రశ్నించారు. కార్మిక సమ్మెకు సంబంధించిన కరపత్రాలను స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కంకణాల మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకురావడం ద్వారా కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను, ప్రకృతి వనరులను, విదేశీ, స్వదేశీ కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు అనేక కుయుక్తులకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. పండించిన పంటలకు కనీస మద్దతు ధర కల్పిస్తామని చెప్పి వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ పరం చేస్తున్నారన్నారు. ఆహార భద్రత చట్టాన్ని నీరుగారుస్తున్నారని, ప్రజా పంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేశారని విమర్శించారు. వామపక్ష వ్యవసాయ కార్మిక సంఘాల పోరాటాల ఫలితంగా వచ్చిన ఉపాధి హామీ చట్టానికి క్రమంగా నిధులు తగ్గించివేస్తున్నారని మండిపడ్డారు. దేశంలోని ఆర్థిక సంక్షోభాన్ని నివారించడానికి, ప్రజల కొనుగోలు శక్తిని పెంపొందించేందుకు ఉపాధి హామీ పథకం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ విషయాన్ని ఆర్థికవేత్తలు చెబుతున్నప్పటికీ మోదీ చెవికెక్కడం లేదన్నారు. వీటన్నింటిపై ఈ నెల 20వ తేదీ దేశవ్యాప్తంగా చేపట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమ్మెకు మద్దతుగా గ్రామీణ ప్రాంతాల్లో నిరసనలు తెలపాలని కోరారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నెరుసుల వెంకటేశ్వర్లు, కె.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వేసవిలో నీటి కొరత లేకుండా చూడాలి

కంభం: వేసవిలో పశుపోషకులకు నీటి కొరత లేకుండా చూడాలని జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ బేబీరాణి సూచించారు. గురువారం కంభం మండలంలోని సోమవారిపేట, అలాగే బేస్తవారిపేట, చెట్టిచెర్ల పంచాయతీలను ఆమె సందర్శించారు. నీటి తొట్ల నిర్మాణాలను తనిఖీ చేశారు. పశువులకు సబ్సిడీపై అందిస్తున్న దాణా, గడ్డి గింజలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పిడుగుల బారి నుంచి పశువులు, జీవాలను సంరక్షించుకునే పద్ధతులను వివరించారు. పశువులకు బీమా చేయించుకోవాలని సూచించారు.

సరస్వతీ పుష్కరాలు పరమ పవిత్రం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

మార్కాపురం: సరస్వతీ నది పుష్కరాలు అత్యంత పవిత్రమైనవని పుస్తక రచయిత స్వయంపాకుల యలమంద కోటీశ్వరశర్మ, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త గోపాలుని హరిహరరావు, ఎన్‌జీఓ సంఘం అధ్యక్షుడు డాక్టర్ బీవీ శ్రీనివాసశాస్త్రి పేర్కొన్నారు. గురువారం రాత్రి పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవనగర్‌లో ఉన్న జీవన వేదం ఆశ్రమంలో నిర్వహించిన కార్యక్రమంలో సరస్వతీ నది పుష్కరాల ప్రాముఖ్యతపై కోటేశ్వరశర్మ రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. మున్సిపల్ కమిషనర్ డీవీ నారాయణరావు, జాతీయ సైన్సు అవార్డు గ్రహీత టి.జగన్నాథ్ మాట్లాడుతూ.. మే 15 నుంచి 26వ తేదీ వరకు సరస్వతీ నది పుష్కరాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. పవిత్రమైన సరస్వతి నదిలో స్నానమాచరించడం వల్ల ఆధ్యాత్మికత భావన పెంపొందుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఎన్‌జీఓ సంఘ కార్యదర్శి వి.శ్రీనివాస్, కృష్ణమూర్తి, ఓఏ మల్లిక్, కమలాపురి శ్రీనివాస్, దూళిపాళ్ల మధుసూదన శర్మ, ఆర్టీసీ శాస్త్రి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. కాగా, తెలంగాణలోని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో పుష్కరాలకు వెళ్లే భక్తుల కోసం మార్కాపురం డిపో నుంచి బస్సులు ఏర్పాటు చేసినట్లు డీఎం నరసింహులు తెలిపారు.

వేడుకగా శ్రీరామనామ సప్తాహ మహోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనారాయణస్వామి

కొనకనమిట్ల: మండల కేంద్రం కొనకనమిట్ల సమీపంలోని రామదూత క్షేత్రంలో 13వ శ్రీరామనామ సప్తాహ మహోత్సవాలు గురువారం వేడుకగా ప్రారంభమయ్యాయి. క్షేత్ర నిర్వాహకులు, వేదపండితులు అకలంకం వెంకట రామకృష్ణాచార్యులు ఆధ్వర్యంలో హోమాలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. శ్రీరామ నామం, అగ్ని ప్రతిష్టాపన కార్యక్రమాలతోపాటు శ్రీలక్ష్మీనారాయణస్వామి కల్యాణం నిర్వహించారు. కల్యాణ ఉభయ దాతలుగా ఎస్.దుర్గారావు, పద్మావతి, ఎస్.జగదీష్, అనూష దంపతులు వ్యవహరించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేయడంతోపాటు అన్న సంతర్పణ చేశారు. ఈ నెల 22వ తేదీ వరకు సప్తాహ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు యక్కంటి తిరుపతిరెడ్డి, గొలమారి విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు.

పాలిసెట్ ఫలితాల్లో దోర్నాల విద్యార్థుల ప్రతిభ

పెద్దదోర్నాల: ఏపీ పాలిసెట్ ఫలితాల్లో మండల కేంద్రానికి చెందిన ఇన్‌స్పైర్ కోచింగ్ సెంటర్ విద్యార్థులు ప్రతిభ చూపడంపై ఉపాధ్యాయులు అభినందనలతో ముంచెత్తారు. మండల కేంద్రానికి చెందిన షేక్ బషీర్ 115 మార్కులతో 436వ ర్యాంక్, షేక్ మాజ్ 113 మార్కులతో 887వ ర్యాంక్ సాధించడంపై కోచింగ్ సెంటర్ డైరెక్టర్ డి.సుధాకర్ అభినందించారు. కోచింగ్ సెంటర్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందనలతో ముంచెత్తారు.

ఉపాధి పనులను పరిశీలించిన కలెక్టర్



ఉపాధి పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

మద్దిపాడు: మండలంలోని ఇనమనమెళ్లూరులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను కలెక్టర్ తమీమ్ అన్సారియా గురువారం ఉదయం పరిశీలించారు. కలెక్టర్ ఆకస్మికంగా ఇనమనమెళ్లూరు వెళ్లి అక్కడ ఫీల్డ్ చానల్ పనులను పరిశీలించారు. ఫీల్డ్ చానల్ ఏర్పాటుతో రైతులకు ఎంతమేరకు మేలు జరుగుతుందన్న అంశాన్ని ఫీల్డ్ అసిస్టెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. రైతులు, గ్రామానికి ఉపయోగపడే విధంగా ఉపాధి హామీ పనులు నిర్వహించాలని ఆమె సూచించారు. అనంతరం ఉపాధి కూలీలతో కలెక్టర్ మాట్లాడుతూ ఎంత వేతనం వస్తుంది, కొలతలు సక్రమంగా తీస్తున్నారా అంటూ వివరాలు సేకరించారు. ఉపాధి కూలీలకు అందుతున్న సౌకర్యాల గురించి ఆమె వారిని అడిగి తెలుసుకున్నారు. గ్రామం మొదటిలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్తను చూసి ఆమె అసహనం వ్యక్తం చేశారు. చెత్త తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ వర ప్రసాద్‌ను కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. ఆమె వెంట ఫీల్డ్ అసిస్టెంట్ ఇందిరా ప్రియదర్శిని, ఉపాధి కూలీలు ఉన్నారు.

ముగిసిన నైపుణ్య శిక్షణ తరగతులు



ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

ఒంగోలు టౌన్: నైపుణ్యాభివృద్ధితో ఏ రంగంలోనైనా రాణించడం సాధ్యమవుతుందని స్థానిక ఏకేవీకే డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.రామిరెడ్డి అన్నారు. ఇంగ్లిషు, కంప్యూటర్‌లో నైపుణ్యాలు పెంపొందించేందుకు ఈ నెల 7 నుంచి 15వ తేదీ వరకు ఏకేవీకే కళాశాలలో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించారు. గురువారం ముగింపు సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామిరెడ్డి పాల్గొని మాట్లాడారు. శిక్షణలో నేర్చుకున్న విషయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతిఒక్కరూ నైపుణ్యాలు మెరుగుపరచుకోవాలని, నిత్య అధ్యయనం, శిక్షణ అలవరచుకోవాలని సూచించారు. మున్ముందు ఇలాంటి ఉపయోగకరమైన శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నట్లు ఏకేవీకే జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి తెలిపారు. శిక్షణ తరగతులలో కంప్యూటర్ వాడుకలోని నైపుణ్యాలపై అధ్యాపకులు సీహెచ్ అలేఖ్య, యు.రమ్య, ఎంవీ సుజన శిక్షణ ఇచ్చారు. ఇంగ్లిషు బాషా నైపుణ్యాలను డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.రామిరెడ్డి బోధించారు. ముగింపు కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతే దేశాభివృద్ధి



శిక్షణను ప్రారంభిస్తున్న ఐద్వా కార్యదర్శి రమాదేవి

సంతనూతలపాడు: మహిళల అభ్యున్నతే దేశాభివృద్ధి అని ఐద్వా జిల్లా కార్యదర్శి రమాదేవి అన్నారు. జన శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం సౌజన్యంతో సంతనూతలపాడులోని సుందరయ్య భవనంలో 90 రోజుల డ్రెస్ మేకింగ్ శిక్షణను ఆమె గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందని, ఆధునిక సమాజంలో మహిళలు ఏదో ఒక వృత్తిలో శిక్షణ పొంది వారి నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందాలన్నారు. కుట్టు శిక్షణ కేంద్రాన్ని మహిళలు ఉపయోగించుకోవాలని కోరారు. సీపీఎం మండల కార్యదర్శి కె.పెద్దబ్బాయి మాట్లాడుతూ సుందరయ్య భవన్ ప్రజా సమస్యల పరిష్కారం కేంద్రంగానేగాక ప్రజలకు సేవా కార్యక్రమాలకు కూడా వినియోగించుకునేందుకు, ముఖ్యంగా సమాజంలో సగభాగంగా ఉన్న మహిళలకు శిక్షణకు ఉపయోగపడుతుందన్నారు. జన శిక్షణ సంస్థ ప్రోగ్రాం ఆఫీసర్ కె.శ్యామ్ సునీల్, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా అధ్యక్షుడు నెరుసుల వెంకటేశ్వర్లు, ఐద్వా నాయకులు కె.బుజ్జి, టైలరింగ్ టీచర్ అనూరాధ పాల్గొన్నారు.

మురుగు గుంతలో కుళాయి



మురుగులోనే నీరు పట్టుకుంటున్న స్థానికులు

కొమరోలు: మండలంలోని గోపాలునిపల్లెలో మంచి నీటి కుళాయి గుంతలో మురుగు ఉండటంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానిక వేణుగోపాలస్వామి ఆలయం వద్ద మోటార్లు వేసినా పైప్ లైన్ ద్వారా ఇంటికి రాకపోవడంతో 3 వీధుల ప్రజలు పబ్లిక్ ట్యాప్ వద్దకు వెళ్లి రోజూ నీరు పట్టుకోవాల్సి వస్తోంది. పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడటంతో ఆ నీరంతా కుళాయి గుంతలో నిల్వ చేరి కలుషితమవుతున్నాయి. ఈ విషయమై మూడు నెలలుగా పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

పంట నష్టానికి ఏడాది.. పరిహారమేది?

- మార్కాపురం సబ్ డివిజన్‌లో 3 మండలాల రైతుల ఎదురుచూపులు
- 5.26 కోట్ల రూపాయల పరిహారం విడుదలలో ప్రభుత్వం మీనమేషాలు
- అన్నదాత సుఖీభవ పథకం కింద ఏడాదిగా అందని సాయం
- పెట్టుబడి కోసం తిప్పలు పడుతున్న అన్నదాతలు



ఎండిపోయిన పత్తి చేను

తర్లుపాడు: శ్రమనే నమ్ముకుని జీవనం సాగిస్తున్న రైతులను ప్రకృతి కకావికలం చేస్తే దన్నుగా నిలిచి ఆదుకోవాల్సిన ప్రభుత్వం కాలయాపన చేస్తూ కొర్రీలు పెడుతోంది. అకాల వర్షాలు, ఈదురుగాలుల ప్రభావంతో చేతికొచ్చిన పంట కోల్పోయి ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్న రైతులకు ఏడాదిగా నిరాశ నిస్పృహలు తప్పడం లేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రకృతి వైపరీత్యాలు సంభవించి పంట నష్టపోయిన రైతులకు ఏ సీజన్‌కు ఆ సీజన్‌లో పరిహారం అందించి అండగా నిలిచారు. కూటమి ప్రభుత్వంలో మాత్రం రైతులకు పరిహారం దక్కడం లేదు. గతేడాది ఖరీఫ్ సీజన్, ఈ ఏడాది రబీ సీజన్‌లో పంట నష్టం సంభవించినా నేటికీ రైతులకు పరిహారం అందలేదు.

మార్కాపురం వ్యవసాయ సబ్‌డివిజన్‌లో మార్కాపురం, తర్లుపాడు, పెద్దారవీడు, కంభం, అర్ధవీడు మండలాలు ఉన్నాయి. గతేడాది ఖరీఫ్ సీజన్‌లో అకాల వర్షాలకు పంటలు దెబ్బతినడంతో అధికారులు నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదికలు పంపారు. ప్రభుత్వం పరిహారం అందించకుండా మీనమేషాలు లెక్కిస్తుండటంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఇక రబీ సీజన్ ప్రారంభమైన తర్వాత డిసెంబర్‌లో మాత్రమే వర్షం కురిసింది. ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో సరైన వర్షం లేకపోవడంతో రబీ సీజన్లో సాగు చేసిన పంటలు ఎండిపోయాయి. ఈ తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కరువు మండలాలను ప్రకటించింది. అందులో మార్కాపురం, తర్లుపాడు మండలాలు కూడా ఉన్నాయి. కరువు మండలాల ప్రకటన వచ్చి నెలరోజులు దాటినా సాయం మాత్రం దక్కలేదు. దీంతో రైతులు రాబోయే ఖరీఫ్ సీజన్‌లో పెట్టుబడి కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు.

గత ఏడాది ఖరీఫ్ నష్టం మండలాల వారీగా ఇలా..

మండలం	నష్టపోయిన రైతులు	పంట నష్టం (హెక్టార్లలో)	అందాల్సిన పరిహారం(రూ.లో)
మార్కాపురం	2,709	2293.12	3,89,02,035
పెద్దారవీడు	1,363	755.06	1,28,87,071
తర్లుపాడు	72	50.64	8,61,033

ఇలా మొత్తం మీద సుమారు 5.26 కోట్ల రూపాయల పరిహారం రైతులకు ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి అందాల్సి ఉంది. దీంతో పాటు రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలు కూడా ఎండిపోయాయి.

ప్రభుత్వం ఇంత వరకు నష్టాన్ని అంచనా వేయించకపోగా, పరిహారం ఇవ్వడంలోనూ జాప్యం చేస్తుండటంతో రైతులు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు.

పరిహారం అందలేదు



గతేడాది ఖరీఫ్ సీజన్‌లో అధిక వర్షాల వల్ల, ఈ ఏడాది రబీ సీజన్‌లో వర్షాలు లేకపోవడంతో పంటలు దెబ్బతిని చాలా నష్టపోయాం. ఈ రెండు సీజన్లకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆర్థిక సాయం మాకు అందలేదు. అన్నదాత సుఖీభవ పథకం కింద పెట్టుబడి సాయం ఎప్పుడిస్తారో తెలియడం లేదు. ప్రభుత్వం ఉదారంగా స్పందించి రైతులకు పరిహారం అందించాలని కోరుతున్నాం.

– జనార్దన్‌రెడ్డి, రైతు, తాడివారిపల్లి

పరిహారమిస్తే ఉపశమనం



గత ఖరీఫ్‌లో భారీ వర్షాలు, రబీలో వర్షాలు సరిగ్గా కురవకపోవడంతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. అరకొరగా పండిన పంటలకు కూడా గిట్టుబాటు ధర లభించడం లేదు. దీని వల్ల రైతులు నష్టాలపాలయ్యారు. ప్రభుత్వం సాయమందిస్తే కొంతలో కొంత ఉపశమనంగా ఉంటుంది.

– మందా వెంకటేశ్వరరెడ్డి, రైతు, మేకలవారిపల్లి

అంచనాలు ప్రభుత్వానికి పంపాం

ఖరీఫ్‌లో అధిక వర్షాల వలన పత్తి, రబీలో వర్షాభావం వల్ల కంది, మినుము, బొబ్బర్లు తదితర పంటలు ఎండిపోయాయి. నష్టపోయిన రైతులకు పరిహారం మంజూరు కోసం ప్రభుత్వానికి నివేదిక పంపాం. నిధులు రాగానే రైతులకు అందిస్తాం.

– వెంకటేశ్వర్లు, ఏఓ, తర్లుపాడు

నేటి నుంచి నాటక పోటీలు

దర్శి (కురిచేడు): స్థానిక వజ్జా నారాయణమ్మ కళా ప్రాంగణంలో దర్శనాపురి నాటక కళాపరిషత్ 12వ జాతీయ స్థాయి ఆహ్వాన నాటక పోటీలు శుక్రవారం నుంచి నిర్వహిస్తున్నట్లు కళాపరిషత్ వ్యవస్థాపక అధ్యక్ష, కార్యదర్శులు కలవకొలను అనంత్, కూనం జైహింద్‌రెడ్డిలు సంయుక్తంగా తెలిపారు. సాయంత్రం 6 గంటలకు ప్రారంభ సభ ఉంటుందన్నారు. పోటీలు ఈ నెల 18 వరకు జరుగుతాయని, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాత్రి 7 గంటలకు చైతన్య కళాభారతి, కరీంనగర్ వారిచే ఖరీదైన జైళ్లు నాటిక ప్రదర్శన, రాత్రి 8 గంటలకు అమరావతి ఆర్ట్స్ గుంటూరు వారితో చిగురు మేఘం నాటిక ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు. శనివారం సాయంత్రం సాయంత్రం 6 గంటలకు దాసరి చంద్రశేఖర్ కళాప్రాంగణంలో సభ జరుగుతుందని, అనంతరం 7 గంటలకు సాయి ఆర్ట్స్ కొలకలూరు వారితో జనరల్ భోగీలు నాటిక, 8 గంటలకు చిలకలూరిపేటకు చెందిన మద్దుకూరి ఆర్ట్స్ వారిచే మా ఇంట్లో మహాభారతం హాస్యనాటిక, 9 గంటలకు హైదరాబాద్‌కు చెందిన యువభేరి థియేటర్ ఆర్ట్స్ వారిచే నా శత్రువు నాటిక ప్రదర్శన ఉంటుందని తెలిపారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు చందు వెంకటయ్య కళాప్రాంగణంలో సభ జరుగుతుందని, అనంతరం రాత్రి 7 గంటలకు విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ హైదరాబాద్ వారిచే స్వేచ్ఛ నాటిక ప్రదర్శన, 8 గంటలకు కూచిపూడి గురుకులం, శ్రీకాకుళం వారిచే ద్రౌపది కూచిపూడి నృత్యరూపకం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 9.30 గంటలకు విజేతలకు బహుమతి ప్రదానం ఉంటుందన్నారు. ప్రదర్శనకు వచ్చిన మహిళా ప్రేక్షకులకు ప్రతి నాటికకు లక్కీ డిప్ ద్వారా నేటి మహిళను ఎంపిక చేసి బహుమతి ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని దర్శి ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నాటుసారా తయారు చేస్తే కఠిన శిక్ష



ర్యాలీలో పాల్గొన్న ఎక్సైజ్ శాఖ అధికారులు

బేస్తవారిపేట: నాటుసారా తయారు చేస్తే ఎనిమిదేళ్ల జైలు శిక్ష, రూ.5 లక్షల జరిమానా ఎదుర్కోవాల్సి వస్తుందని మార్కాపురం అసిస్టెంట్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ డి.బాలయ్య హెచ్చరించారు. గురువారం మండలంలోని చెన్నుపల్లె, కోనపల్లెలో నాటుసారాతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. నాటుసారా తాగితే అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని చెప్పారు. రీహాబిలిటేషన్, జీవనోపాధి కోసం ఎటువంటి సహాయం కావాలో పాత నేరస్తులను అడిగి తెలుసుకున్నారు. నాటుసారా నిర్మూలనపై గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించి, అవగాహన ర్యాలీ నిర్వహించారు. కంభం ఎక్సైజ్ సీఐ ఎస్.కొండారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవకు దరఖాస్తు చేసుకోవాలి

ముండ్లమూరు (కురిచేడు): అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్, రైతు భరోసా పథకాలకు రైతులు ఈ నెల 20వ తేదీలోపు రైతు సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎండీ ఫరూక్ కోరారు. 2025 సంవత్సరంలో అన్నదాత సుఖీభవ పథకం కోసం 21,789 మంది రైతు ఖాతాలు ఉండగా వారిలో కేవలం 8,889 మంది రైతుల ఖాతాలు మాత్రమే తనిఖీ చేసినట్లు పేర్కొన్నారు. మిగిలిన రైతులందరూ తమ ఆధార్‌కార్డు, పొలం పట్టాదారు పాస్‌పుస్తకం తీసుకుని మీ పరిధిలోని రైతు సేవాకేంద్రాల్లో వ్యవసాయ సహాయకులను కలిసి వెబ్‌ల్యాండ్‌లో ఆధార్ లింకును సరి చేయించుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని మండలంలోని అన్ని గ్రామాల రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి జె.రాజరాజేశ్వరి, ఏఈఓ వేమూరు శ్రీకీర్తి, వ్యవసాయ సహాయకులు ఆంజనేయులు, రైతులు పాల్గొన్నారు.